క్లుప్తంగా

గిరిజన మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా అమ్మ శ్రీను



పర్వతగిరి : బీజేపీ అనుబంధ గిరిజన మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా మండలంలోని చెరువుకొమ్ముతండాకు చెందిన అమ్మ శ్రీను (ధరావత్ శ్రీనివాస్) నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు జె.కల్యాణ్‌నాయక్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. అమ్మ శ్రీను గతంలో ఏబీవీపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా, ఎస్టీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా, నిరుద్యోగ జేఏసీ సభ్యుడిగా బాధ్యలు నిర్వర్తించాడు. రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన సందర్భంగా శ్రీనివాస్ మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. గిరిజనుల సంక్షేమానికి, బీజేపీ బలోపేతానికి పాటుపడతానని చెప్పారు. తన నియామకానికి సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. శ్రీనివాస్ నియామకం పట్ల తండావాసులు హర్షం వ్యక్తం చేశారు.

పరామర్శ



దుగ్గొండి : మండలంలోని పీజీతండాకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు అజ్మీర రవీందర్‌ను అతడి తండ్రి చనిపోయిన నేపథ్యంలో నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి శనివారం పరామర్శించారు. అనంతరం నాచినపల్లిలో మంద సమ్మక్క మృతి చెందగా ఆమె కొడుకులైన సాంబయ్య, నర్సయ్యలను ఎమ్మెల్యే పరామర్శించారు. తదనంతరం పానకల్‌లో బోగి సాంబయ్యను అతడి తల్లి చనిపోయిన నేపథ్యంలో ఎమ్మెల్యే పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాసరెడ్డి, నాయకులు చెన్నూరి కిరణ్‌రెడ్డి, ఒలిగె నర్సింగరావు, ఆర్.రాంరెడ్డి, మట్ట రాజు, మాదాసి సాంబయ్య, భరత్‌రెడ్డి, రవివర్మ ఉన్నారు.

బియ్యం సాయం



నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని దాసరిపల్లికి చెందిన గొల్లెన రజిత ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా బాధిత కుటుంబానికి డీఆర్ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు దాసరి రాజిరెడ్డి 50 కేజీల బియ్యం సాయంగా అందజేసి ఓదార్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పెండ్యాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వర్ధన్నపేట : వర్ధన్నపేట పట్టణంలోని 132 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో నేడు (ఆదివారం) ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏడీఈ రాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ మెయింటెనెన్స్‌లో భాగంగా మరమ్మతు పనుల నేపథ్యంలో విద్యుత్ కోత విధించాలి వస్తోందని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

'ఆరు గ్యారంటీ'లను వెంటనే అమలు చేయాలి

పర్వతగిరి : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ప్రకటించిన మేరకు ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రంగు కుమార్‌గౌడ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ వంద రోజుల్లోగా ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని ఊదరగొట్టి ఓట్లు దండుకుని అధికారంలోకి వచ్చిందని ధ్వజమెత్తారు. రైతుబంధు డబ్బులు చెల్లించడంలో ప్రభుత్వం విఫలమైందని తెలిపారు. అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా గ్యారంటీల అమలులో చొరవ చూపకుండా ప్రకటనలతో మోసపూరితంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

నేడు ఎస్టీయూ రాష్ట్ర స్థాయి సమావేశం

విద్యారణ్యపురి: స్టేట్ టీచర్స్ యూనియన్ రాష్ట్రస్థాయి కార్యవర్గ సమావేశాన్ని ఈనెల 25న హనుమకొండలోని ఎస్టీయూ భవనంలో నిర్వహిస్తామని రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి సదయ్య తెలిపారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పర్వతరెడ్డి అధ్యక్షతన జరగనున్న సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానందం గౌడ్, రాష్ట్ర బాధ్యులు, 33 జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొంటారని చెప్పారు. సమావేశంలో రాష్ట్రంలోని విద్యా విషయక అంశాలు, విద్యా వ్యవస్థలోని తీరుతెన్నులుపై చర్చించనున్నట్లు సదయ్య వివరించారు. ఉపాధ్యాయుల సమస్యలపైనా చర్చిస్తారని తెలిపారు. విద్యావ్యవస్థ పటిష్టత, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి సమావేశానికి ఏర్పాట్లను హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పర్యవేక్షిస్తున్నారని తెలిపారు.

జనం నుంచి వనంలోకి..

జెండగట్టుకు సమ్మక్క

- ముగిసిన మద్దిమేడారం జాతర
- జాతర ఆదాయం రూ.3.38 లక్షలు

నల్లబెల్లి : అశేష భక్తజనాన్ని ఆశీర్వదించిన నాగరాజుపల్లి మద్ది మేడారం తల్లులు జనం నుంచి వనానికి చేరారు. సమ్మక్క–సారలమ్మ గద్దెకు చేరుకున్నప్పటి నుంచి తిరిగి వనంలోకి వెళ్లేప్పటి దాకా భక్తులు తల్లులను దర్శించుకొని తన్మయత్వం పొందారు. శనివారం నాడు సమ్మక్క వనప్రవేశం చేయడంతో జాతర ముగిసింది. సారలమ్మ, పగిడిద్ద రాజు, గోవిందరాజులను మండలంలోని గుండ్లపహాడ్ గాంధీనగర్‌లోని సారలయ్మ ఆలయానికి తీసుకెళ్లారు. సమ్మక్క తల్లిని గద్దెల నుంచి వనానికి చేర్చే క్రమంలో వడ్డెలు దురిశెట్టి నాగరాజుతోపాటు దురిశెట్టి సమ్మయ్య, సమ్మక్క, హరికృష్ణ, ధర్మపురి సువర్ణ తదితరులు శనివారం సాయంత్రం డోలువాయిద్యాల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అప్పటికే సారలమ్మ, గోవిందరాజులు, పగిడిద్దరాజుల గద్దెల వద్ద వడ్డెలు రహస్య పూజలు పూర్తి చేశారు. డోలువాయిద్యాల నడుమ గద్దెల ప్రాంతం మార్మోగింది. పూజ ముగిసే వరకు గద్దెల వద్ద దర్శనాలకు భక్తులను అనుమతించలేదు. అనంతరం సమ్మక్క తల్లిని తీసుకుని వడ్డెలు గద్దె దిగారు. తొలుత సారలమ్మను తీసుకెళ్లి ఎదురుకోల్ల దగ్గర పూజలు నిర్వహించారు. అనంతరం సమ్మక్కను జెండగట్టు వైపు తీసుకెళ్లారు.



వనదేవలను దర్శించుకుంటున్న భక్తులు

సారలమ్మతోపాటు..

సారలమ్మతోపాటు పగిడిద్దరాజు, గోవిందరాజులను గుండ్లపహాడ్ శివారు గాంధీనగర్ తీసుకవెళ్లేందుకు వడ్డెలు ప్రత్యేక పూజలు చేశారు. సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులను గద్దెలపై నుంచి గాంధీనగర్‌కు తీసుకెళ్లారు. దీంతో జాతర ముగిసింది. సారలమ్మ వనప్రవేశ పూజలు జరుగుతుండగానే గిరిజన సంప్రదాయం ప్రకారం సమ్మక్క గద్దెలపై భక్తులు సమర్పించిన చీర సారె, బంగారం, పసుపు, కుంకుమను భక్తులు తీసుకెళ్లేందుకు పోటీ పడ్డారు.

పూజారులకు పట్టువస్త్రాలు

ఆలయ ప్రధాన పూజారులు దురిశెట్టి సమ్మయ్య, సమ్మక్క, నాగరాజు, హరికృష్ణలకు నాగరాజుపల్లి మాజీ సర్పంచ్ గొనే శ్రీదేవి పట్టువస్త్రాతలు అందించి సన్మానించారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ గాదె సుదర్శన్‌రెడ్డితో కలిసి మాజీ సర్పంచ్ శ్రీదేవి వనదేవలను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు బంగారం(బెల్లం) పంపిణీ చేశారు.



హుండీలు లెక్కిస్తున్న సభ్యులు, అధికారులు



పూజారులకు వస్త్రాలు అందిస్తున్న శ్రీదేవి

జాతర ఆదాయం రూ.3.38 లక్షలు

జాతర ముగియడంతో తహసీల్దార్ రాజేశ్, ఎస్సై నగేశ్, దేవాదాయ శాఖ మహబూబాబాద్ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ నందనం కవిత, ఆలయ కమిటీ చైర్మన్ గాదె సుదర్శన్‌రెడ్డి, మద్దిమేడారం జాతర ఇన్‌చార్జ్ ఈఓ భిక్షమాచారి పర్యవేక్షణలో జాతర ఆవరణలో ఏర్పాటు చేసిన హుండీలను తెరిచి లెక్కించారు. హుండీల ద్వారా రూ.1,56,052 నగదు, దుకాణాల వేలం పాటల ద్వారా రూ.1,82,380 సమకూరినట్లు ఇన్‌చార్జ్ ఈఓ భిక్షమాచారి తెలిపారు. జాతర విజయవంతం కావడం పట్ల ఆలయ కమిటీ హర్షం వ్యక్తం చేసింది. జాతరలో సేవలు అందించిన అధికారులకు, భక్తులకు కృతజ్ఞతలు తెలిపింది.

కనులపండువగా వేంకటేశ్వరుడి కల్యాణం



కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

- తలంబ్రాలు సమర్పించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు దంపతులు

రాయపర్తి : మండలంలోని సన్నూరు గ్రామంలోని శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని శనివారం కన్నుల పండువగా నిర్వహించారు. ఉదయం నుంచి నిత్య హోమం, బలిహరణం, పల్లకిసేవ, కల్యాణ వస్త్ర సమర్పణ, రజత పుష్పార్చన, నిత్యహోమం, బలిహరణం, కల్యాణ మహోత్సవ వేడుకలను చేపట్టారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఆయన సతీమణి ఉష పట్టువస్త్రాలు, తలంబ్రాలతో పాల్గొన్నారు. భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి కల్యాణాన్ని తిలకించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నాయకులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మూనావత్ నర్సింహ నాయక్, పార్టీ అభివృద్ధి కమిటీ చైర్మన్ బిల్లా సుధీర్ రెడ్డి, మాజీ సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.



తలంబ్రాలతో వస్తున్న ఎర్రబెల్లి దంపతులు

కల్యాణంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

కల్యాణంలో తొర్రూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హామ్యానాయక్, పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి, నాయకులు కుందూరు గోపాల్‌రెడ్డి, నంగునూరి అశోక్, విక్రమ్‌రెడ్డి, ఉల్లెంగుల యాదగిరి, చిన్నపాక ఎల్లయ్య, రాజిరెడ్డి, గబ్బెట బాబు, మల్లయ్య, శ్రీను, బిక్షం, సమ్మయ్య, వెంకన్న, కృష్ణ, రామ, ఎల్లారెడ్డి, జమ్మిలాల్ ధర్మకర్తలు, అభివృద్ధి కమిటీ సభ్యులు రామకృష్ణారెడ్డి, అశోక్‌రెడ్డి, రమేశ్‌రెడ్డి, భీష్మారెడ్డి పాల్గొన్నారు.

రైల్వే సమస్యలను పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న గ్రూప్ సభ్యులు

నెక్కొండ : స్థానిక రైల్వేస్టేషన్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నెక్కొండ పట్టణ రైల్వే టికెట్స్ అవేర్నెస్ ఫోరం వాట్సాప్ గ్రూప్ సభ్యులు స్టేషన్ మాస్టర్ సుశీల్‌కుమార్ పాండేకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వాట్సప్ గ్రూప్ సభ్యులు మాట్లాడారు. స్టేషన్‌లోని రెండో ప్లాట్‌ఫారం వరకున్న పుట్ ఓవర్ బ్రిడ్జిని మూడో ప్లాట్‌ఫారం వరకు పొడగించాలని, మూడో ప్లాట్‌ఫారంపై టికెట్ బుకింగ్ కౌంటర్ ఏర్పాటు చేయాలని, డిమాండ్ ఉన్న ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ సౌకర్యం కలించాలని కోరారు. కార్యక్రమంలో ఐ న్యూస్ డైరెక్టర్ గటిక విజయ్‌కుమార్, గ్రూప్ సభ్యులు అంబాల రాంగోపాల్, గోరంట్ల వెంకట్‌నారాయణ, కుడికాల కుమారస్వామి, పులి ప్రసాద్, గన్ను కృష్ణ, నేతుల సారంగపాణి, రాపోలు యాకయ్య, కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మొరం ట్రాక్టర్ల సీజ్

చెన్నారావుపేట : అక్రమంగా మొరం తరలిస్తున్న 3 ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఏఎస్సై లక్ష్మణమూర్తి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని నంబర్ వన్ కాలనీ శివారులోని గుట్ట నుంచి ఖాదర్‌పేటకు చెందిన పెంతల రాజు, గూడ రవీందర్, చెరువుకొమ్ము తండాకు బోడ మహేందర్ ట్రాక్టర్లలో శనివారం అక్రమంగా మొరం తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. సదరు ట్రాక్టర్లను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేస్తామని తెలిపారు. ఇసుకను అక్రమంగా తరలిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

గ్రామస్తుడి ఔదార్యం.. డ్రెయినేజీ శుభ్రం

చెన్నారావుపేట : మండల కేంద్రంలోని డ్రెయినేజీలను గ్రామ పంచాయతీ సిబ్బంది శుభ్రం చేయకపోవడంతో స్థానికుడు శ్రీరామోజు ఉపేంద్రచారి శుభ్రం చేసి ఆదర్శంగా నిలిచాడు. ఈ ఘటన శనివారం చోటు చేసుకుంది. వివరాలిలా.. గ్రామంలోని డ్రెయినేజీల్లో చెత్తాచెదారం పేరుకుపోయింది. మురుగునీరు నిలిచి దుర్గంధం వెదజల్లుతోంది. దోమలు వ్యాపించి రోగాల బారిన పడుతున్నామంటూ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో పంచాయతీ సిబ్బంది పట్టించుకోకపోవడంతో ఉపేంద్రచారి నడుం బిగించారు. స్వయంగా డ్రెయినేజీలను శుభ్రం చేశారు. అధికారులు స్పందించి ఇతర డ్రెయినేజీల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించి మురుగునీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



డ్రెయినేజీలోని చెత్తను తొలగిస్తున్న ఉపేంద్రచారి

సబ్ కమిటీ వేయడం అభినందనీయం

చెన్నారావుపేట : జీఓ నంబర్ 317పై ముగ్గురు మంత్రులతో రాష్ట్ర ప్రభుత్వం సబ్ కమిటీ వేయడం అభినందనీయమని పీఆర్టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి పులి దేవేందర్ తెలిపారు. మండల కేంద్రంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం సబ్‌కమిటీ వేయడాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. కమిటీ వేయడం వరకే పరిమితం కాకుండా రానున్న లోకసభ ఎన్నికల లోపే ఉద్యోగ ఉపాధ్యాయులకు గుదిబండగా పరిణమించిన జీఓ నంబర్ 317ను రద్దు చేసి బదిలీలు చేపట్టాలని ఆకాంక్షించారు. ఉద్యోగ సంఘాల సలహాలు, సూచనలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

విలువలతో కూడిన విద్యతోనే ఉన్నతి



నాగరాజును సత్కరిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

నర్సంపేట : విద్యార్థులకు నైతిక విలువలతో కూడిన విద్య అందిస్తేనే వారు జీవితంలో ఉన్నతి సాధించగలరని హైదరాబాద్ డీజీపీ కార్యాలయ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ డి.నాగరాజు తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలను శనివారం ఆయన సందర్శించి విద్యార్థులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. సమాజాన్ని సజావుగా నడిపించేందుకు వ్యవసాయం, విద్యాబోధన, వైద్యం, రక్షణ కీలకమని చెప్పారు. సమాజం పట్ల గురువు బాధ్యతలు ప్రత్యేకమని తెలిపారు. విద్యార్థులకు తరగతి గదుల్లో నిర్దేశిత పాఠ్యాంశాలే కాకుండా సమాజం పట్ల అవగాహన కల్పించాలని, బాధ్యత నేర్పాలని సూచించారు. ఉపాధ్యాయులు సమాజ నిర్దేశకులని తెలిపారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని చెప్పారు. అమ్మ చెంప దెబ్బకు, గురువు బెత్తం దెబ్బకు మారని విద్యార్థి పోలీస్ లాఠీ దెబ్బ తినాల్సి వస్తుందని హాస్యం జోడించి హెచ్చరించారు. ఎలాంటి సమస్యలు ఎదురైనా విద్యార్థులు కుంగిపోవద్దని స్పష్టం చేశారు. క్షణికావేశంలో తప్పుడు నిర్ణయాలు తీసుకోవద్దని కోరారు. సమస్యలు జీవితంలో భాగమని, ధైర్యంగా ఎదుర్కొని విజయాలు సాధించాలని తెలిపారు. అనంతరం నాగరాజును ప్రిన్సిపాల్ మల్లం నవీన్, అధ్యాపకులు శాలువాతో సత్కరించారు.

జర్నలిస్టుపై దాడి సరికాదు

నర్సంపేట : హైదరాబాద్‌లోని ఎల్బీనగర్‌లో తెలంగాణ దిన పత్రిక సీఈఓ, ఎడిటర్ శంకర్ గౌడ్‌పై దండగులు దాడి చేయడం సరికాదని గౌడ జన హక్కుల పోరాట సమితి (మోకుదెబ్బ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేశ్ అన్నారు. ప్రభుత్వం వెంటనే నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

మెరుగైన ఫలితాలు సాధించాలి



పర్వతగిరి : పదో తరగతి విద్యార్థులు క్రమశిక్షణతో చదివి మెరుగైన ఫలితాలు సాధించాలని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్.సమ్మయ్య తెలిపారు. మండల కేంద్రంలోని ఆ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థినులకు పోశాల భద్రయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వాహకుడు పోశాల నవీన్ శనివారం పరీక్ష ప్యాడ్లు, పెన్నులు అందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సమ్మయ్య మాట్లాడారు. భవిష్యత్ బాగుండాలంటే చదువుతోనే సాధ్యమన్నారు. మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు. పరీక్షలు ఎలా రాయాలో సబ్జెక్టుల వారీగా అవగాహన కల్పించారు. బాగా చదువుకుంటే జీవితంలో ఏదైనా సాధించవచ్చని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ స్వాతి, ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు వేల్పుల కుమారస్వామి, మాంకాల యాదగిరి, ముజ్జిగ అనిల్‌రావు, యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం



దుగ్గొండి : మండలంలోని గిర్నిబావిలోని హనుమాన్ ఆలయంలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో శనివారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించారు. ఈ సందర్భంగా వందలాది మంది దంపతులు వ్రతం ఆచరించారు. దీంతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. అనంతరం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కటకం రామచంద్రం, అనుముల రాజిరెడ్డి, మల్లారెడ్డి, యార నర్సిరెడ్డి, కొత్తూరి రమేశ్, కరట్లపెల్లి రాజేశ్వర్‌రావు, భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కాజీపేట అర్బన్: బేగంపేట, రామంతాపూర్‌లలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూళ్లలో 1వ తరగతి డే స్కాలర్ ప్రవేశానికి ఎస్సీ బాలికల నుంచి 2024–25 విద్యా సంవత్సరానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి బి.నిర్మల శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 25 నుంచి మార్చి 12 వరకు దరఖాస్తులను జిల్లా సహాయ షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయంలో, హసన్‌పర్తిలోని సహాయ షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

స్వామి వారికి శఠగోపం బహూకరణ



గీసుకొండ : మండలంలోని ఎలుకుర్తిహవేలిలో జరుగుతున్న శ్రీ లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో స్వామి వారి కల్యాణం సందర్భంగా మనుగొండకు చెందిన జిల్లా కాంగ్రెస్ నాయకులు అల్లం బాలకిశోర్‌రెడ్డి–స్వప్నదేవి దంపతులు స్వామివారికి రూ. 75 వేల విలువైన శఠగోపాన్ని బహూకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంపీపీ బీమగాని సౌజన్య, నాయకులు మర్రెడ్డి, తుమ్మనపెల్లి శ్రీనివాస్, కొమ్ము శ్రీకాంత్, కందికొండ రాజు, మాదాసి రాంబాబు, నల్ల సురేశ్‌బాబు, తిప్పారపు శ్రీనివాస్ పాల్గొన్నారు.

'ఖురాన్'ను అనుసరించాలి



నర్సంపేట : ఖురాన్ గ్రంథాన్ని అనుసరణీయమని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్, జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీపాల తెలిపారు. పట్టణంలోని ఆ స్కూల్‌లో 26 మంది విద్యార్థులు ఖురాన్ చదవడం పూర్తైన సందర్భంగా శనివారం కత్ముల్ ఖురాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీపాల మాట్లాడారు. విద్యార్థులు ఖురాన్‌లోని అన్ని విషయాలను, నిబంధనలను జీవితంలో ఆచరించి ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులను ప్రిన్సిపాల్ శ్రీపాల, అరబిక్ టీచర్ రేష్మ, ఉపాధ్యాయులు అభినందించారు.

రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

శాయంపేట : మండలంలోని కొప్పుల నుంచి పరకాల వరకు నిర్మించబోయే రోడ్డు నిర్మాణ పనులను భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు శనివారం కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌డీఎస్‌డీఎఫ్ నిధుల నుంచి మంజూరైన రూ.7 కోట్ల నిధులతో పనులు ప్రారంభించినట్లు తెలిపారు. త్వరగా రోడ్డు పనులు పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తామని సూచించారు. ప్రజాసమస్యలు పరిష్కరించేలా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ చల్లా చక్రపాణి, పరకాల మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పోలెపల్లి శ్రీనివాస్ రెడ్డి, నాయకులు ఏరుకొండ శంకర్, నిమ్మల రమేష్, రవి, రాంరెడ్డి, తిరుపతిరెడ్డి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.